కథా నిలయం
శ్రీకాకుళం

# సుబ్బులు పెళ్లాం

నిజానికీ కథ మొదలు పెట్టాల్సిన పద్ధతి ఇది కాదనుకుంటాను.

ఎవరో అన్నట్టు కథ ఏ గాలివానలో చిక్కుకున్న ఆడపిల్లతోనో, ధనవంతుల గారాల పట్టికోసం గాలం వేస్తోన్న కుర్ర ప్రేమకుడితోనో మొదలు పెడితే సస్పెన్స్ పుట్టి కథ సాంతం చదివిస్తుంది.

కానిది కథకాదు. నా కళ్ళముందు ఒక్కసారి మెరుపులా మెరిసి నా మెదడులో మరిన్ని మెరుపుల్నీ మంటల్నీ కురిపించిన కొన్ని జీవితాల తాలూకు వాస్తవ చిత్రణ!

అసలేం జరిగిందంటే –

ఆ రోజున ఆఫీసు నుంచి అలసి ఇంటికొచ్చేసరికి ముందు గదిలో సుబ్బులు కూర్చునున్నాడు. వాడు కూర్చున్న తీరూ నన్ను చూసి కలవరపడ్డ పద్ధతీ అన్నీ చూసేసరికి ఒకటో రకం వెధవన్పించింది. జనరల్‌గా సుబ్బారావు అన్నపేరు వినేసరికి జాలి కలుగుతుంది గాని, మా సుబ్బులు గాడ్ని తలచుకుంటే మహా అసహ్యంగా ఉంటుంది. వాడి నంగినంగి ప్రవర్తనకి మరీ మంటగా వుంటుంది.

“ఏరా! ఎంత సేపయ్యిందేమిటి వచ్చీ?“

“ఇప్పుడే...”

“కాఫీ త్రాగావా?”

“ఆ\...”

లోపలికెళ్ళి బట్టలు మార్చుకుని కాఫీ త్రాగుతూ వచ్చి వాడి కెదురు గుండా వున్న కుర్చీలో కూర్చుంటూ వాడ్నోసారి ఆసాంతం చూశాను. కొంచెంగా కలవరపడ్డాడు సుబ్బులు.

“ఏమిటి కథా?”

“అబ్బే-ఏం లేదు మావయ్యా!”

"ఊరికే వస్తారుటోయ్ మీరూ? ఏదో పెద్ద కథ వుండి వుండాలి."

ఇబ్బందిగా కదుల్తూ - "అదే హైదరాబాదు అత్తగారి లత లేదూ..." అన్నాడు.

"ఉంటే?"

"అదే...నేను పెళ్ళి చేసుకుందామనీ, అహ- చేసుకుంటే బావుంటుందని మా అమ్మ అంటోంటేనూ... నువ్వు వాళ్ళతో మాట్లాడతావనీ..."

నేను వాడివంకే చేష్టలు దక్కి చూస్తున్నాను. వాడేమనుకున్నాడో గాని నావంకోసారి అనుమానంగా చూసి అన్నాడు "లక్ష్మి కూడా ఒప్పుకుంది..."

"ఏవిటీ! అమ్మాయి కూడా ఒప్పుకుందా?"

"మనస్ఫూర్తిగా ఒప్పుకుంది మావయ్యా!"

"ఊ! అయితే లతని నువ్వు చేసుకుంటానంటావ్!"

"మా అమ్మ కూడా పోరుతూంటేనూ..."

"ఒప్పుకున్నానంటావ్. సరే చూద్దాంలే. మీ అమ్మనోసారి కన్పించమను"

వాడు వెళ్ళిపోయాడు. వాడి ముఖంలో వచ్చిన మార్పు నే గమనించకపోలేదు.

సుబ్బులు పెళ్ళి చేసుకుంటాట్ట!

నిజానికి పెళ్ళి చేసుకోవడం విశేషంకాదు. కాని భార్యా, నలుగురు పిల్లలూ గల సుబ్బులు మళ్ళీ పెళ్ళి చేసుకుంటాననడం విడ్డూరమే మరి. పోనీ వాడి భార్య రోగిష్ఠిదైతే అదో రకంగా వుండేది. కాని నిక్షేపంలాంటి భార్యా, పెళ్ళి కావల్సిన ఇద్దరు తమ్ముళ్ళూ, ఓ చెల్లెలూ, తన మీదే ఆధారపడ్డ తల్లి - అంతా వుండగా వీడికీ బుద్ధిపుట్టడం - మిగిలినవాళ్ళ మాటెలావున్నా నాకాశ్చర్యంగా లేదు. వాడలాంటి వెధవ్వే అన్పిస్తూంటుంది వాడ్ని చూడగానే.

ఏమైనా ఈమధ్య యువతరంలో డబ్బు పిచ్చీ, భోగలాలసా వెర్రి తలలు వేస్తోందనే చెప్పాలి. ఏ రకంగానైనా సరే డబ్బు సంపాదించెయ్యాలి. బాధ్యతా రహితంగా స్వేచ్ఛగా తిరగెయ్యాలి. అందిన చోటల్లా ఆనందాన్ని రెండు చేతులా జుర్రుకోవాలి. ఇదా భావితరం?!

లేకపోతే సుబ్బులు లతని పెళ్లి చేసుకుంటాట్ట!

లత!

లత లాంటి లత. పెనవేసుకున్న వృక్షం కూలిపోగా జీవితపు పెనుగాలిలో చిక్కుకుని అల్లల్లాడిపోతున్న లత!

లత-రెండు పదులు దాటి రెండేళ్ళైనా కాని లత. అందగత్తె అని అంతా అందలం ఎక్కించకపోవచ్చుగాని అనాకారి అన వీలులేని లత.

ఇదివరకెంత బాగుండేదీ!

నేను వెళ్ళినప్పుడల్లా పిల్ల సెలయేరులా తుళ్ళుతూ గలగలా నవ్వుతూ కబుర్లు చెప్పేది. ఉత్సాహమే వూపిరిగా మసలేది.

నేను ప్రతిసారీ ఆమెకు చక్కని వరుడు లభించాలనీ ఆమె భావి జీవితం వెన్నెల లోకానికి పరచిన మల్లెలబాటలా వుండాలని తలస్తూండేవాణ్ణి. అలా ఎక్కడ కాకుండా పోతుందో అన్న భయంతో తప్పకుండా అలాగే కావాలని పదే పదే పిచ్చిగా అనుకొంటూండే వాణ్ణి.

అప్పట్లో సుబ్బులు హైదరాబాదులోనే గుమాస్తా గిరీ వెలగబెడుతూండేవాడు. ఉండటం ఎక్కడో అయినా మా ద్వారా కలిసిన చుట్టరికం వల్ల (వాడు నా మేనల్లుడు. లత నా తోడల్లుడి కూతురు) అప్పుడప్పుడూ వాళ్ళింటి కెళ్తూండటం వల్ల లతపై మోజు పడ్డట్టున్నాడు. ఆమెని తనకిచ్చి చేయమని చెప్పమంటూ వచ్చాడోమాటు.

అప్పటికే డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోన్న లతని థర్డ్‌క్లాస్ డిగ్రీ హోల్డరూ, గుమాస్తా అయిన సుబ్బులికివ్వడానికి, నాకూ మా తోడల్లుడికీ కూడా బొత్తిగా ఇష్టంలేకపోయింది. పైగా ఎంతో కొంత కట్నం ఇవ్వగలిగి వుండికూడా ఇలాటి లిక్కు లిక్కు సంబంధం చెయ్యాల్సిన గత్యంతరం వాళ్ళకు లేదు కూడా.

దాంతో లత క్యారక్టర్ మంచిది కాదని ప్రచారం చేశాడీ బద్మాష్ సుబ్బులు.

వాడి కుయుక్తులకి లొంగక బుద్ధిమంతుడూ లెక్చరర్‌గా పనిచేస్తున్న వాడూ అయిన ఓ చక్కని వరుణ్ణి తెచ్చాం లతకి.

పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. ఆనాడు ఆ దంపతులపై అక్షింతలు వేస్తూ పొందిన ఆనందం మళ్ళీ ఇంతవరకూ ఎన్నడూ పొందలేదు. ఇకపై పొందలేను కూడా.

లతకి అన్నివిధాలా తగిన భర్త లభించినందుకు నా గుండెల మీంచేదో పెద్ద బరువు తొలగినట్లుగా అనుభూతి పొందాను.

కానీ ఆ ఆనందం, అనుభూతి ఎన్నాళ్ళో నిలవలేదు. విధి లతని చిన్నచూపు చూసింది.

పెళ్ళైన కొన్నాళ్ళకే అత్తవారింటికెళ్ళిన లత-చిటికెడు కన్నీళ్ళతో పుట్టింటి గడప దాటిన లత-చిన్నారి పొన్నారి సన్నజాజి మాలలాంటి లత-పుట్టెడు దు:ఖంతో తిరిగి వచ్చింది కొన్ని నెలలకే!

ఆమె నుదుటి కుంకుమ తీసుకుని అసురసంధ్యా సూర్యుని తోబాటు అంతరించాడామె భర్త!

అతడికోసం మృత్యువు స్కూటర్ యాక్సిడెంట్ రూపంలో పొంచి వుంటుందని ఎవరూహించగలరు? ఊహించనిది జరగటమే జీవితమంటారందుకే కాబోలు.

లతకామె భర్త తాలూకు ఆస్తీ, డబ్బూ చాలానే వచ్చింది. కాని నూరేళ్ళపంట మూన్నాళ్ళ ముచ్చటైనప్పుడు డబ్బేం చేసుకోను? కానొకోసారి ఆ డబ్బూ శాపమౌతూంటుంది!

నడిరోడ్డు మీద మురికితో చిరిగిన పేలికల్తో అసభ్యంగా అసహ్యంగా వున్న ముష్టిపిల్ల చేతిలో ఓ వందరూపాయల నోటుంటే, పదిమందీ చుట్టూ చేరి, పొగిడి బుజ్జగించి లాలించి మచ్చిక చేసుకో ప్రయత్నిస్తూ, మిగిలినవాళ్ళ కన్నా ఆ నోటు తనకిస్తే తను వుద్ధరిస్తానని ప్రతీవారూ గప్పాలు కొట్టే ఈ రోజుల్లో, లక్షాధికారిణి అయిన ఓ ఆడపిల్లని- అమె వితంతువే అవుగాక - వుద్ధరిస్తానంటూ ఎగబడని కప్పలుంటాయా? ఉండవని సుబ్బులే నిరూపిస్తున్నాడు!

సుబ్బులొచ్చి వెళ్ళిన మర్నాడు సుబ్బులు తల్లి, అంటే నా చెల్లెలూ సుబ్బులు పెళ్ళాం లక్ష్మి వచ్చారు.

"ఏవిటేవ్! నీ కొడుకుని మళ్ళీ పెళ్ళి చేసుకోమని పోరుతున్నావుట?"

"మళ్ళీ ఇదోటా నా ప్రాణానికి?! అసలే ఆలుమగలిద్దరూ నీతో చెప్పు చెప్పంటూ చంపుకు తింటున్నారని నేనేడుస్తూంటేనూ!" నిజంగానే ఏడ్చేస్తూ అంది.

"నువ్వూరు కోవే. సుబ్బులలా చెప్పాళ్ళే. లక్ష్మి కూడా వచ్చినట్టుంది."

"వచ్చాను బాబాయ్!" తలుపుచాటు నుంచంది సుబ్బులు పెళ్ళాం.

"చూస్తున్నావుగదమ్మాయ్ సుబ్బులు వరసని. నువ్వైనా నాలుగు దులపకపోయావా?"

"ఇందులో తప్పేముందని బాబాయ్! ఆయనకి లతని పెళ్ళి చేసుకోవాలనుంది. చేసుకుంటానంటున్నారు."

"భేష్-బావుంది. వాళ్ళమధ్య నువ్వెందుకని తప్పుకుని సినిమాల్లోలా త్యాగం చేస్తానంటావ్. కాని ఇది సినిమా కాదే - జీవితం!"

"సినిమాలు కూడా జీవితాల్నాధారం గానే తీస్తారు బాబాయ్!"

"ఊహూ-ఏవిటో అనుకున్నానుకాని నీకు సినిమా నాలెడ్జి బాగా వుందే. మరి నువ్వెలా బ్రతకాలనుకుంటున్నావ్?"

"ఆ అమ్మాయికి లక్షాయాభైవేల ఆస్తి వుంది కదా బాబాయ్! అందులో ఓ యాభైవేలు నా ముఖాన కొడితే నా దారి నేను చూసుకుంటాను."

"అదన్న మాట ప్లాను. బావుంది. మరి పిల్లల సంగతి?"

"నా దగ్గరే వుంటారు."

"విన్నావుటే నీ కోడలి మాటలు? చూడమ్మాయ్! నువ్వింకా చిన్నదానివి. జీవితం లోతుపాతుల్ని చూడని దానివి. జీవితమంటే అణాలూ రూపాయలే కాదమ్మా అంతకంటే చాలా చాలా ఎక్కువ. సుబ్బులేదో అరచేతిలో స్వర్గం చూపిస్తే నమ్మేసి తలూపుతున్నావు గాని, నువ్వనుకున్నదేమీ నిజంకాదు. డబ్బు గురించి భర్తనీ సంసారాన్నీ వదిలి నువ్వేకాదు – ఎవరూ సుఖపడలేరు. డబ్బు అన్ని సుఖాలూ ఇవ్వగలదనుకోవడం చాలా పొరపాటు.

భర్త గురించి అన్నీ వదులుకున్న వాళ్ళూ అన్నిటికీ తెగించిన వాళ్ళూ పురాణకాలం నుంచీ వున్నారుగాని ఇలా డబ్బుకో మరో దానికో కక్కుర్తిపడి మొగుడ్ని వదులుకున్న వాళ్ళెక్కడా ఎప్పుడూ లేరు. మగడు మనుష్యదేవుడని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయంటే దాని అర్థం అంతరార్థం తెలుసుకో. సినిమాల్లోనూ నవలల్లోనూ చూపించే కల్పిత జీవితాలని చూసి నీ జీవితాన్నీ, పిల్లల భవిష్యత్తునీ చేజేతులా పాడు చెయ్యకు. నా మాట విని నువ్వు గమ్మునుండు! సుబ్బుల్ని నేను మందలిస్తాన్లే"

"మీ అంత వయస్సు లేకపోవచ్చు గాని నాకు తగ్గ అనుభవం నాకూ వుంది బాబాయ్! అంతా బాగా ఆలోచించాకే నేనీ నిర్ణయానికొచ్చాను. మీరెలా అయినా వాళ్ళని ఒప్పిస్తే..."

కొన్ని క్షణాల పాటామె వంకే చూస్తుండిపోయాను పిచ్చిగా.

ఏమిటీమో మనస్తత్వం? ఏమిటీమె ధైర్యం?

ఏమిటీమె ఆలోచన? ఏమిటీమె తెగింపు?

ఎందుకామె ఇంత విపరీతంగా ప్రవర్తిస్తోంది?

ఎవరీమె లేత మెదడుని కలుషితం చేసింది?

బుర్ర వేడెక్కి పోయింది గాని సమాధానాలు లభించలేదు!

నిట్టూర్చి అన్నాను – "వూఁ బాగానే వుంది. సరే నీ దృక్పథం నుంచే ఆలోచిద్దాం. సుబ్బులుకి నువ్వు కట్టిన విలువ యాభైవేలు. అంతసొమ్మిస్తే అతగాడ్ని వదిలిపోవడానికి నీకేం అభ్యంతరం లేదు. మరి యాభైవేల నీ మొగుడ్ని లక్షన్నర పెట్టి లతెందుకు కొనుక్కుంటుంది చెప్పు? ఆమె కొనుక్కోవాలంటే లక్షన్నర విలువ చేసే మొగుడ్నే కొనుక్కుంటుంది గానీ నీ మొగుడ్నెందుకు కొనుక్కోవాలి చెప్పు? అయినా నీ కక్కర్లేని మొగుడు దాని కెందుకు?

యాభై వేలతో నువ్వు ఒంటరిగా హాయిగా బ్రతగ్గలిగినప్పుడు లక్షన్నరతో నీ మొగుడ్ని చేసుకోకుండా లతెందుకు బ్రతకలేదు? అసలే అది ఏడుస్తోంది పెళ్ళొద్దని. నా డబ్బుని చూసి చేసుకుంటారుగానీ నన్ను చూసి చేసుకోరంటోందది. అలాటప్పుడు డబ్బు కోసం పెళ్ళికి సిద్ధపడ్డ సుబ్బుల్నెలా చేసుకుంటుంది చెప్పు. మీకేకాదు - బుర్ర అందరికీ వుంటుందనీ వాళ్ళూ ఆలోచిస్తారని గ్రహించి ఇలాంటి వెర్రి మొర్రి వేషాలెయ్యక తిన్నగా మెలగండి. మగాడికి లేని అణుకువ ఆడదానివి నీకుండాలి. వాడ్ని నువ్వు మందలించడం పోయి నేనమ్మా అంటూ నువ్వే ముందుంటే వాడెంతకు తెగిస్తాడో ఆలోచించి నీ కాపురాన్ని చక్కదిద్దుకో!"

నా మాటలకి బాగా కోపం వచ్చినట్టుంది. విస విసా వెళ్ళిపోయింది సుబ్బులు పెళ్ళాం.

ఇది జరిగిన కొన్నాళ్ళకి మా తోడల్లుడు ఉత్తరం రాశాడు - 'మీ అమ్మాయిని మా ఆయన కిచ్చి చేయండి. ఆయన్ని నేను ఒప్పిస్తాను. నాకేం అభ్యంతరం లేదంటూ' సుబ్బులు పెళ్ళాం ఉత్తరం రాసిందట!

వెంటనే వాళ్ళకి ఉత్తరం రాశాను - ఈ విషయం నా దగ్గరకీ వచ్చిందనీ - మందలించి పంపాననీ.

మరి కొన్నాళ్ళ వరకూ సుబ్బులి వార్తలేం తెలీకపోయినా ఇకలాటి ఆలోచనలు కట్టి పెట్టి వుంటారనే అనుకున్నాను. దానికి తోడు నేనీ మధ్య టూర్స్ ఎక్కువ వెళ్ళాల్సి వస్తూండటంతో వాళ్ళింటి కెళ్ళి విషయాలు కనుక్కునే తీరిక లేకపోయింది.

అప్పుడే కేంపు నుంచి వచ్చిన నా చెవిలో బాంబులాంటి వార్త పేల్చింది నా మిస్సెస్.

సుబ్బులు ఓ మార్వాడీ శేఠ్ భార్యతో ప్రణయం సాగించాట్ట. దానికి లక్ష్మి ప్రోత్సాహం కూడా వుందిట. కడకోనాడు చెప్పా పెట్టకుండా భార్యచేతిలో చిల్లుకానీ పెట్టకుండా ఆ మార్వాడీ కుటుంబంతో కలిసి మహారాష్ట్రో ఎక్కడికో వెళ్ళిపోయాట్ట సుబ్బులు! నాల్రోజు లేడ్చి పిల్లల్తో సహా లక్ష్మి ఎక్కడికో వెళ్ళిపోయిందిట!

వెంటనే మా చెల్లెలింటికి పరుగెత్తాను. లబో దిబోమందది. ఓదార్చి లక్ష్మి గురించి పోలీసు రిపోర్టిచ్చాను. అంతటితో వూరుకోక మనుషుల్ని పంపి వెదికించాను గాని ఆమె జాడ తెలీలేదు.

ఏమయ్యుంటుంది?

ఆవేశం తప్ప ఆలోచన లేని పిల్ల. ఏ ఘోరానికి తల పడిందోనని బాధపడ్డాం.

ఇది జరిగి రెండు సంవత్సరాలపైనే అయ్యింది. ఇంతవరకూ ఆమె జాడ తెలీలేదుగానీ నిన్నగాక మొన్న కన్పించింది అనుకోకుండా అనుకోని పరిస్థితుల్లో.

శ్యామ్ బెనగల్ సినిమా 'భూమిక' చాలా బావుందని మిత్రులనడంతో వెళ్ళాను. సినిమా అయిపోయింది. బయటంతా నేల ఈనినట్టు ఒకటే జనం. దానికి తగ్గట్టు అంతక్రితం వరకూ వర్షం పడిందేమో - ఒకటే బురద, బంద.

ఈ జనంలో కారు తీసుకెళ్ళడం సాధ్యం కాదని, ఆ పైన వుంటానని డ్రైవరుతో చెప్పి ముందుకెళ్ళి జనాని కడ్డు లేకుండా ఓ పక్కగా నిలబడ్డాను సిగరెట్టు వెలిగించి.

నా వెనుకనున్న ఎలక్ట్రిక్ పోల్ క్రీనీడలో ఏదో నీడ కదలినట్లయి అటు చూశాను.

ఒక స్త్రీ!

అర్థంగాక అటే చూసూ్తండిపోయాను. ఆమె కొంచెం తటపటాయించి తలొంచుకునొచ్చి నా చెయ్యి పట్టుకుని లాగింది.

ఆమె తెగింపుకాశ్చర్యంతో ర్రాన్పడిపోయాను.

నా భావం అర్థంగాక కాబోలు ఆమె తలెత్తింది.

అంతే!

ఇద్దరం షాక్ తిన్నాం.

ఆమె నా చెయ్యి వదిలేసి రెండడుగులు వెనక్కేసింది.

"నువ్వు...నువ్వు... లక్ష్మీ?!"

"అలా పిలవకండి బాబాయ్! నా పేరిప్పుడు చిలక."

"ఇదేం బ్రతుకమ్మా? ఈ రొంపిలో కెలా వచ్చి పడ్డావ్? నువ్వింకా ఎక్కడికో వెళ్ళుంటావ్. ఏదో చేసి వుంటావనుకున్నాంగాని ఇలా-ఇలా అవుతావనుకోలేదు."

"జాలి పడకండి బాబాయ్! మీ మాట విననందుకీ శిక్ష అనుభవించాల్సిందే."

"అసలిలా ఎలా అయ్యావమ్మా?"

"ఏం చెప్పను బాబాయ్! ఆయన వెళ్ళిపోయారు. నాకంతా అయోమయంగా అన్పించింది. ఆయన వెళ్ళేప్పుడు డబ్బిస్తారనుకున్నాను. కాని ఇంత దగా చేస్తారనుకోలేదు. ఆయన వెళ్ళిపోవడంతో డబ్బు పిచ్చి నన్ను నిలవనీయలేదు. సినిమాల్లో వేశ్యలమీదకి విసిరే కొత్త నోట్ల కట్టలు నా కళ్ళని కప్పేశాయ్. కథల్లోని వేశ్యల మేడలూ, నగలూ నా విచక్షణా జ్ఞానాన్ని సమాధి చేశాయ్. ఫలితంగా ఇదిగో ఈ వూబిలో దిగబడి పోయాను....

ఇప్పుడు, కొరుక్కు తింటోన్న సుఖరోగాల్తో, రోజూ రెండుపూటలా తిన నోచుకోకుండా, ఎంత లేవలేకపోయినా ఇలా మగాళ్ళని పిలిచి ఒళ్ళప్పగించకపోతే నోట్లోకి ముద్ద వుండదని గ్రహించిన ఇప్పుడు తెలుస్తోంది బాబాయ్ - జీవితమంటే ఏమిటో! కథలూ, సినిమాలు అంటే ఏమిటో...!"

"ఎంత పని చేశావమ్మా! అన్నట్టు పిల్లలు?"

"అనాధాశ్రమంలో వదిలేశాను. నేను బాగా డబ్బు గడించాక తీసుకొద్దా మనుకున్నాను. కానీ, నేనే బ్రతకలేకుండా వున్నాను. ఇక వాళ్ళనేం పోషించగలను?"

ఆమె పెదాలపై కదిలిన శుష్కహాసం నా గుండెల్ని ఉక్కుహస్తాలతో నలిపేసింది.

నే నిప్పుడేం చెయ్యాలి?

నా బుర్ర బ్రద్దలయిపోతోంది. గుండెల్లో చెలరేగుతోన్న జ్వాలలు! మెదడుపై సమ్మెట పోటులు! ఏం చెయ్యాలేం చెయ్యాలి?

దూరంగా నా కారు వస్తూ కనిపించింది.

నేనామెతో మాట్లాడుతూండటం డ్రయివరు చూస్తే ఏమనుకుంటాడు? ఇంతవరకూ గొప్పవాడనుకుంటున్న మా ఆఫీసురు కూడా సినిమా హాలు ప్రక్కన అణా కానీ ఆడవాళ్ళతో బేరాలాడతాడనుకోడూ?

ఆమెతో వెళ్ళొస్తాననికూడా చెప్పకుండా గబగబా ఎదురెళ్ళి కారెక్కాను.

నేను దారుణంగా ప్రవర్తించానని మీరనుకున్నా ఫరవాలేదు. ఎంచేతంటే ముందే చెప్పేను - ఇది కథ కాదు. సినిమా అంతకన్నా కాదు. జీవితం అని!

**(విజయ మాసపత్రిక)**

**జనవరి 1984**